ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 13 ఏప్రిల్ 2024



అద్దె భవనాల్లో అంగన్వాడీ కేంద్రాలు 8లో..
రోడ్డుపక్క ట్రాన్స్‌ఫార్మర్లు.. పొంచి ఉన్న ప్రమాదం 8లో..

అగ్గి అంటుకుంటే బుగ్గే



- అగ్ని ప్రమాదాల్లో బూడిదవుతున్న ఆస్తులు, ప్రాణాలు
- జిల్లాలో మూడే ఫైర్ స్టేషన్లు.. వేధిస్తున్న సిబ్బంది కొరత
- అవగాహన లేమితో పెరుగుతున్న ప్రమాదాలు
- 14 నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

మంథని, ఏప్రిల్ 12 : ప్రస్తుత వేసవిలో ఏ చిన్న అగ్ని ప్రమాదం సంభవించినా పెనుముప్పుగా మారే అవకాశం లేకపోలేదు. కాస్తంత ఏమరుపాటుతో.. చిన్నచిన్న తప్పిదాలతో.. దావాగ్నిగా మారితే లక్షల రూపాయల ఆస్తులు, విలువైన ప్రాణాలు బుగ్గిపాలు కావాల్సిందే. ముదురుతున్న ఎండలతో అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటే నివారించడం సవాల్‌గా మారుతుంది.

● పరిష్కారం కాని సమస్యలు..

జిల్లాలో 14 మండలాలుండగా, పెద్దపల్లి, మంథని, గోదావరిఖనిల్లో మాత్రమే ఫైర్ స్టేషన్లు ఉన్నాయి. జిల్లాలో జనాభాకు సరిపడా ఫైర్ స్టేషన్లు లేవు. ప్రస్తుతం ఉన్నవాటిలో కొన్ని ఫైర్ ఇంజన్లు, ఇతర సామగ్రి ఫిట్‌నెస్ సరిగ్గా లేవు. ఫైర్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న పోస్టుల సిబ్బంది కొరత వేధిస్తోంది. ఫైర్‌మన్ ఖాళీ పోస్టులను హోంగార్డుల డిప్యూటేషన్‌తో భర్తీ చేశారు. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదాలు చోటుచేసుకుంటే వాటిని నివారించడానికి ఫైర్ ఇంజన్లు సకాలంలో వచ్చే అవకాశం లేదు. వచ్చిన వాటికి నీరు అందుబాటులో ఉండే పరిస్థితులు కన్పించడం లేదు. ఇదే జరిగితే అగ్ని ప్రమాదాల్లో ఇళ్లు, షాపులు, వాటిల్లోని విలువైన సామగ్రి కాలిబూడిద కావడంతో పాటు కొన్ని సందర్భాల్లో ప్రాణనష్టం సంభవించే అవకాశముంది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే శ్రేయస్కరం. ఎక్కడైనా అగ్ని ప్రమాదం సంభవిస్తే తమ మొబైల్ లేదా ఫోన్ ద్వారా 101కు కాల్‌చేసి సంబంధిత ప్రమాద, చిరునామా విషయంలో స్పష్టమైన వివరాలు తెలియజేస్తే అగ్ని మాపక సిబ్బంది అక్కడికి వచ్చి ప్రమాదాలను నివారించడానికి ఆస్కారముంటుంది.



మంథని ఫైర్ స్టేషన్

● ఫైర్‌స్టేషన్లలో ఉద్యోగుల కొరత..

జిల్లాలోని మూడు ఫైర్ స్టేషన్లలో ఉద్యోగుల కొరత ఉంది. మంథనిలో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జితో సేవలు కొనసాగిస్తున్నారు. మంథని, గోదావరిఖని, పెద్దపల్లి ఫైర్ స్టేషన్లలో ప్రతి స్టేషన్‌లో 10మంది ఫైర్ మెన్‌లు ఉండాల్సి ఉండగా 4-5 మంది వరకు ఫైర్‌మెన్ల కొరత ఉంది. ప్రతి స్టేషన్‌లో 3 డ్రైవర్ పోస్టులకు గాను ఒక్కో డ్రైవర్ పోస్టులు ఖాళీ ఉన్నాయి. కొరత ఉన్న స్టేషన్లలో హోంగార్డులతో సేవలు తీసుకుంటున్నారు. నూతనంగా ఏర్పాటైన జిల్లాలోని మరే ఇతర ప్రాంతాల్లో నూతన ఫైర్ స్టేషన్ల ఏర్పాటుకు ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు లేవు.

ఇరుకు ప్రదేశాల్లో మిస్ట్ బుల్లెట్ సేవలు

అగ్ని ప్రమాదం జరిగినపుడు తక్షణమే స్పందించి వేగంగా సంఘటన స్థలానికి చేరుకోవడానికి ఇరుకు సందుల్లోకి సైతం వెళ్లడానికి అనువుగా ప్రభుత్వం మిస్ట్ బుల్లెట్ సేవలను అందుబాటులోకి తీసుకు వచ్చింది. అందులో భాగంగా జిల్లాలోని మూడు అగ్నిమాపక కేంద్రాలకు ఒక్కొక్క మిస్ట్ బుల్లెట్ వాహనాన్ని కేటాయించారు.



విద్యుత్, అగ్ని ప్రమదాలు జరిగినప్పుడు ఏం చేయాలి?

విద్యుత్ ప్రమాదాలు సంభవించినప్పుడు నీటిని వినియోగించరాదు. పొడి ఇసుకను మాత్రమే ప్రమాదాల నివారణకు వినియోగించాలి. తొలుత విద్యుత్ మెయిన్ స్విచ్‌ను ఆఫ్ చేసిన తరువాత మాత్రమే ఫైర్‌ను ఆర్పడానికి ప్రయత్నించాలి. విద్యుత్ సరఫరా ఉన్న వైర్లపై అత్యవసర పరిస్థితుల్లో కార్బన్‌డయాక్సైడ్ ఎక్స్‌టింగిషర్‌ను ఉపయోగించాలి. అగ్ని ప్రమాద సిబ్బందికి సమాచారమందించాలి.

■ స్కూల్స్, షాపింగ్ మాల్స్, ఆసుపత్రుల్లో..

స్కూల్స్, షాపింగ్ మాల్స్, ఆసుపత్రుల్లో ఆర్‌సీసీ కప్పును మాత్రమే వాడాలి. ఫైర్ అలార్మం, ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమున్న ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలి. సెల్లార్లలో ఆటోమెటిక్ స్ప్రింక్లర్స్‌ను ఏర్పాటు చేసుకోవాలి. ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా బయటపడాలో అందరికీ తెలిసే విధంగా ఏర్పాట్లు చేయాలి. ఐఎస్‌ఐ మార్క్ కలిగిన ఎలక్ట్రికల్ సామగ్రి మాత్రమే వినియోగించాలి. బయటికి వచ్చే మార్గాల్లో మెట్లు, తలుపుల వద్ద ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలి. తాటి ఆకులు, గడ్డితో చేసిన పైకప్పులను వినియోగించరాదు. ఎలక్ట్రికల్ షార్ట్‌సర్క్యూట్ జరగకుండా మినీ పీహెచ్‌ఆర్ సర్క్యూట్ బ్రేకర్స్‌ను అమర్చాలి. ఫ్లేమ్ ప్రూఫ్ మోటార్ స్పార్క్ స్విచ్‌లను మాత్రమే వినియోగించాలి. ప్రమాదాలను అరికట్టడానికి సరిపడా నీటిని, ఫిక్స్‌డ్ ఫైర్‌ఫైటింగ్ ఎక్స్‌టింగ్విషర్స్‌ను నిబంధనల మేరకు ఎప్పుడూ సిద్ధంగా ఉంచాలి. ఫైర్‌ఎవాక్యుయేషన్ డ్రిల్లులను ప్రతి మూడు నెలలకోసారి పరిశీలించాలి.

■ గోదాములు, గిడ్డంగుల్లో..

స్టాక్‌ను చెక్క స్లీపర్లపైన మాత్రమే నిల్వచేయాలి. వివిధ రకాల వస్తువులను స్టోరేజ్ అరల్లో వేర్వేరుగా నిల్వచేయాలి. మధ్యలో గ్యాంగ్ వే లేదా క్రాస్ సెక్షన్లను ఉంచాలి. వస్తువులను 4.5 మీటర్ల కంటే ఎక్కువ ఎత్తులో నిల్వ చేయరాదు. పైకప్పు స్లాబ్‌కు మధ్యలో కనీసం రెండు అడుగుల దూరం ఉండాలి. వస్తువులు ఎత్తడం, దించే సమయాల్లో వాహనాల్లోని ఇంజన్లను ఆపివేయాలి. తగినంత గాలి, వెలుతురు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి.

■ కర్మాగారాల్లో..

ఉద్యోగులందరికీ అగ్ని ఉనికి ప్రదేశాలను గుర్తించే విధంగా, బేసిక్ ఫైర్‌ఫైటింగ్‌లో శిక్షణ ఇవ్వాలి. ప్రమాదాలకు అస్కారమున్న ప్రదేశాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలి. మిషనరీ బెల్టును, పుల్లీలు, విద్యుత్ పరికరాల నుంచి నిప్పు రవ్వలు రాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సర్క్యూట్లపై ఓవర్ లోడ్ పడకుండా చర్యలు తీసుకోవాలి.

■ నివాస గృహాల్లో..

చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాసులు, మండే పదార్థాలను అందుబాటులో ఉంచకూడదు. కాల్చిన సిగరెట్లు, బీడీలు, అగ్గిపుల్లలను పూర్తిగా ఆర్పివేయకుండా పడవేయవద్దు. ఇంట్లోని వైరింగ్‌లో ఐఎస్‌ఐ కలిగి ఉన్న ఎలక్ట్రికల్ వస్తువులను మాత్రమే వినియోగించాలి. ఎక్కువ రోజులు ఊరికి వెళ్తే విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేయాలి. ఎప్పుడూ ఇంట్లో నీరు నిల్వ ఉండే విధంగా చూసుకోవాలి. వంట గదుల్లో వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలి. గ్యాస్ ట్యూబ్‌లను ఐఎస్‌ఐ మార్క్ ఉన్న వాటినే వాడాలి. గ్యాస్ సిలిండర్ వినియోగం తరువాత రెగ్యులేటర్ వాల్వును ఆపి వేయాలి. గ్యాస్ లీక్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. మండుతున్నప్పుడు స్టౌవ్‌లో కిరోసిన్ పోయవద్దు. వంటగదిలో కిరోసిన్ పెట్రోల్, డీజిల్, అదనపు గ్యాస్ సిలిండర్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి..

■ గ్రామీణ ప్రాంతాల్లో..

పూర్తిగా ఎండిన గడ్డిని మాత్రమే వాములుగా పేర్చాలి. వీటిని నివాస గృహాలకు 60 అడుగుల దూరంలో నిల్వ చేయాలి. పెద్దపెద్ద గడివాములకు బదులు, చిన్నచిన్న వాములుగా ఏర్పాటు చేసుకోవడం ఉత్తమం. గడివాముల మధ్య ఖాళీ స్థలం ఉండే విధంగా చూడాలి. గుడిసెల మధ్య కూడా 30 అడుగుల దూరాన్ని పాటించాలి. బహిరంగ మంటలను ఈ ప్రాంతంలో అనుమతించరాదు. వంట పొయ్యిలను పడుకునే ముందు ఆర్పే విధంగా జాగ్రత్తపడాలి. అందుబాటులో తగినంత నీటి నిల్వలను ఉంచుకులా చర్యలు తీసుకోవాలి.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి : సీపీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఏప్రిల్ 12: యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగంపై జరిగే అనర్థాలపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయికి బానిసలుగా మారి యువత తన భవిష్యత్‌ను నాశనం చేసుకుంటోందని, దానివల్ల వారి తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ శ్రీనివాస్, ఎస్‌ఈ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బుద్ధే స్వామి పాల్గొన్నారు.

మోతాదుకు మించి సౌండ్ పెట్టొద్దు : ఏసీపీ



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, ఏప్రిల్ 12: గోదావరిఖని సబ్‌డివిజన్‌లోని డీజే ఆపరేటర్లు ఫంక్షన్లు, ఇతర కార్యక్రమాల్లో మోతాదుకు మించి శబ్దంతో డీజేలు ఆపరేటర్ చేయవద్దని, అలాచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సబ్ డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని డీజే ఓనర్లు, ఆపరేటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఏదైనా కార్యక్రమానికి డీజే పెట్టాలంటే పోలీస్ స్టేషన్ల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని, రాత్రి 10గంటలలోపు కార్యక్రమాన్ని ముగించాలన్నారు. 60 నుంచి 80డిసిబుల్స్ కన్నా శబ్దం ఎక్కువ ఉండవద్దని, కొందరు 130 నుంచి 150డిసిబుల్స్ సౌండ్ పెడుతున్నారన్నారు. దీనివల్ల చిన్నపిల్లలు, వృద్ధులకు అనారోగ్య సమస్యలు, హార్ట్‌ఎటాక్ వచ్చే ప్రమాదముందన్నారు. డీజే ఓనర్లు, ఆపరేటర్లు ఇకనుంచి మోతాదుకు మించి సౌండ్ పెట్టవద్దని, సమయపాలన పాటించాలని సూచించారు. దీన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోదావరిఖని వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, టుటౌన్ ఇన్‌స్పెక్టర్ బీ రవీందర్, రామగుండం, మంథని ఇన్‌స్పెక్టర్లు అజయ్, వెంకట్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే జైలు శిక్ష : ట్రాఫిక్ సీఐ

కోల్‌సిటీ, ఏప్రిల్ 12: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వ్యక్తులకు జైలు శిక్ష తప్పదని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు మానవ బాంబులకన్నా ప్రమాదమన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, అమాయక ప్రయాణికులు, పాదచారులు క్షతగాత్రులు కావడం, మరణించడం జరుగుతుందన్నారు. తద్వారా వారి కుటుంబాలు దిక్కులేని పరిస్థితి ఉంటుందన్నారు. ఇంటిదగ్గర మనకోసం కుటుంబం ఎదురుచూస్తుందనే భావనతో ప్రతిఒక్కరూ మెలగాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాలు సీజ్ చేయడంతో పాటు లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. కోర్టులో భారీ జరిమానాలతో పాటు జైలుశిక్ష కూడా విధించడం జరుగుతుందన్నారు. శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 24మందిని కోర్టులో హాజరుపర్చగా ఒక్కొక్కరికి రూ.2000చొప్పున రూ.48వేలు జరిమానా విధించారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లికి సన్మానం



వడ్డెపల్లి రాంచందర్‌ను సన్మానిస్తున్న టీజీబీకేఎస్ నాయకులు

జ్యోతినగర్, ఏప్రిల్ 12 : జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్‌ను తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీజీబీకేఎస్) స్టీరింగ్ కమిటీ రాష్ట్ర చైర్మన్ మిరియాల రాజిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎన్టీపీసీ వీజీవీ గెస్టుహౌస్(జ్యోతిభవన్)లో జరిగిన కార్యక్రమంలో రాంచందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మిరియాల రాజిరెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుడి కుమారుడు వడ్డెపల్లి రాంచందర్‌కు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడిగా నియమించడం సింగరేణికి దక్కిన గౌరవమన్నారు. సింగరేణిలో పని చేస్తున్న దళితులకు రోస్టర్ విధానం, రిజర్వేషన్ పాలసీని సక్రమంగా అమలయ్యే విధంగా సింగరేణి అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో టీజీబీకేఎస్ నాయకులు నూనె కొమరయ్య, మాదిసి రాంమూర్తి, పర్లపల్లి రవి, వడ్డెపల్లి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టెండర్లను రద్దు చేయాలి



గట్టేపల్లి మానేరులో దీక్షలు చేస్తున్న నాయకులు

సుల్తానాబాద్, ఏప్రిల్ 12: మానేరు పరివాహక ప్రాంతంలో ప్రభుత్వం నిర్వహించిన ఇసుక టెండర్లను వెంటనే రద్దు చేయాలని ఏఐటియూసి జిల్లా ప్రధానకార్యదర్శి కడారి సునిల్ డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలంలోని గట్టేపల్లి మానేరు వాగులో ఇదే డిమాండ్‌తో దీక్షలు చేస్తున్న నాయకులకు శుక్రవారం సునిల్ సంఘీభావం తెలిపారు. దీక్షలకు ఏఐటీయూసీ తరపున సంపూర్ణ మద్దతును తెలిపారు. ఈ కార్యక్రమంలో దామోదర్‌రావు, ఎంపీటీసీ శీలం శంకర్, మాజీ సర్పంచ్ రాజమౌళి, గుర్రం శ్రీనివాస్ గౌడ్, శేఖర్ రాజారామ్, ప్రసాద్, రాజిరెడ్డి, రవి పాల్గొన్నారు.

నేడు మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతి

- కాంగ్రెస్ శ్రేణుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు



దుద్దిళ్ల శ్రీపాదరావు(ఫైల్)

మంథని, ఏప్రిల్ 12: అజాత శత్రువుగా పేరుగాంచిన మాజీ శాసన సభ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు (బుచ్చిపంతులు) భౌతికంగా దూరమై 25 యేళ్ల గడిచినప్పటికీ నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంగా ఉన్న మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేసి ప్రజల మన్ననలు పొందిన తరుణంలోనే శ్రీపాదరావును అకాల మృత్యువు కాటువేసింది. కాటారం మండలం ధన్వాడ గ్రామంలో పుట్టిన శ్రీపాదరావు మంథని నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎంఎల్ఏగా గెలుపొంది శాసన సభ స్పీకర్‌గా రాణించారు. స్పీకర్‌గా అసెంబ్లీలో రాజకీయ చతురత ప్రదర్శించి అనేక క్లిష్ట సమయాల్లో అధికార, ప్రతిపక్ష పార్టీల అభిమానాన్ని చూరగొన్నారు. ఎన్నో అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అమలుచేయించి మంథని ప్రాంత అభివృద్ధి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మంథని నియోజకవర్గంలోని మహదేవపూర్ మండలం అన్నారం అటవీ ప్రాంతంలో శ్రీపాదరావును మావోయిస్టు(పీపుల్స్ వార్) నక్సల్స్ 1999 ఏప్రిల్ 13న కాల్చి చంపారు. ఈ సంఘటన అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కాగా నక్సల్స్ ప్రాబల్యం అధికంగా ఉన్న మంథని నియోజవకర్గంలో వారి చర్యను సామాన్య ప్రజలు సైతం తీవ్రంగా వ్యతిరేకించడం, ఆ తర్వాత కొంత కాలానికి శ్రీపాదరావు హత్య విషయంలో తొందరపడినట్లు నక్సల్స్ ప్రకటించడం ఆయన మంచి తనానికి, మానవీయ విలువలకు నిదర్శనం. శ్రీపాదరావు హత్యోదంతంతో ఆయన రాజకీయ వారసుడిగా రంగ ప్రవేశం చేసిన దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనతి కాలంలోనే ప్రజాదరణ పొంది ఎంఎల్ఏగా ఐదుసార్లు విజయం సాధించారు. ప్రస్తుతం ఆయన ఐటీ, శాసనసభ వ్యవహారాల మంత్రిగా ప్రస్తుతం పని చేస్తున్నారు. శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకొని శ్రీపాద ట్రస్టు, కాంగ్రెస్ పార్టీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గంలోని పలు మండలాలతో పాటు భూపాలపల్లి జిల్లాలోనూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

సమస్యల పరిష్కారానికే వార్డుల సందర్శన

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమసురేష్‌రెడ్డి



వార్డును సందర్శిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమసురేష్‌రెడ్డి

మంథని, ఏప్రిల్ 12: మంథని మున్సిపల్ పరిధిలో ఉన్న సమస్యలను తెలుసుకోవడానికే వార్డుల సందర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని, వీలైనంత తొందరలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి వెల్లడించారు. స్థానిక రెండో వార్డులో ఆమె శుక్రవారం పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటికి సంబంధించినటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పారిశుద్యానికి సంబంధించి కూడా పూర్తిస్థాయిలో తమ సిబ్బందిని ఉపయోగించుకొని కాలనీలను శుభ్రంగా ఉంచే విధంగా కృషి చేస్తున్నాని అన్నారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. మున్సిపల్ పరిధిలో సామాన్య ప్రజలకు ఎటువంటి సమస్యలు వచ్చినా తమ పాలకవర్గం నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీపతి బానయ్య, మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పౌరాణిక కథలు స్ఫూర్తినిస్తాయి..

- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 12: పౌరాణిక కథలు ఇప్పటికీ కూడా యువతకు స్ఫూర్తినిస్తాయని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. మండలంలోని ఆశన్నపల్లె గ్రామంలో చిరుతల రామాయణం ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల వారు ఇప్పటికీ పౌరాణిక నాటకాలు వేస్తూ రామాయణం కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తూ చక్కగా నటిస్తున్న గ్రామస్థులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, ఎంపీటీసీ సంపత్, కాంగ్రెస్ నాయకులు మంద వెంకన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజనవేన సదయ్య, మాదాసు సతీష్, అరెల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిపెట్టిన మృతదేహానికి పోస్ట్‌మార్టం

మానకొండూర్, ఏప్రిల్ 12: మండలంలోని లింగాపూర్ గ్రామంలో పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించి పోలీసులు పోస్ట్‌మార్టం చేయించారు. వివరాలిలా ఉన్నాయి. లింగాపూర్ గ్రామానికి చెందిన బట్బూరి సంపత్‌కుమార్ (34) పిల్లలు పుట్టడం లేదని ఈ నెల 10న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని పోలీసులకు తెలుపకుండా 11న మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. ఈ సమాచారం పోలీసులకు అందింది. దీంతో శుక్రవారం పోలీసులు గ్రామానికి చేరుకుని సంపత్‌కుమార్ కుటుంబసభ్యులను విచారించారు. సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడని నిర్ధారించుకుని పూడ్చిపెట్టిన మృతదేహాన్ని వెలికి తీయించారు. అక్కడికే వైద్య సిబ్బందిని తీసుకొచ్చి పోస్ట్‌మార్టం నిర్వహించారు. అనంతరం మళ్లీ మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. సంపత్‌కమార్ తండ్రి రాజేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 12: జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన పూదరి రామయ్య(56) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం రామయ్య తన నూతన ఇంటి నిర్మాణం కోసం రూ. 10 లక్షలు అప్పు చేశాడు. దీనికి తోడు అనారోగ్యకారణాలతో బాధపడుతున్నాడు. దీంతో కొన్ని రోజులుగా అప్పు ఎలా తీర్చాలని మన స్తాపం చెందుతున్నాడు. ఈనేపథ్యంలో గురువారం పురుగులమందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న బంధువులు రామయ్యను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ . పరిస్థితి విషమించి శుక్రవారం మృతిచెందాడు. రామయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలి పారు.

నకిలీ ఉద్యోగ నియామక పత్రం

అవాక్కయిన వైద్యుడు..పోలీసులకు ఫిర్యాదు

కోరుట్ల, ఏప్రిల్ 12: నకిలీ ఉద్యోగ నియామక పత్రం చూసి ఓ వైద్యుడు అవాక్కయ్యాడు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో ఉద్యోగ నియామక పత్రం ఎక్కడి నుంచి వచ్చిందని డ్యూటీలో ఉన్న వైద్యుడు తమ ఉన్నతాధికారులకు సమాచారం అందించాడు. అది నకిలీదిగా గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగ నియామక ప్రతం జిల్లా వైద్యాధికారి పేరుతో కూడిన జాయినింగ్ లేఖను పట్టణానికి చెందిన ఓ మహి ళ శుక్రవారం ఉదయం డ్యూటీలో ఉన్న వైద్యుడు అనిల్‌కు అందించింది. వైద్యుడికి అనుమానం వచ్చి జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులకు విషయం తెలిపాడు. దీం తో వారు ఎవరికీ ఎలాంటి ఉద్యోగ నియామక పత్రం అందించలేదని అది నకిలీదని తెలపడంతో వైద్యుడు అనిల్ స్థానిక పోలీ ులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు చేరుకుని సంబంధిత మహిళ వద్ద ఉన్న సర్టిఫికెట్లను స్వాధీనం చేసు కుని మహిళను పోలీసు స్టేషన్‌కు తరలించారు. కరీంనగర్ పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న కథలాపూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రైవేట్ ఉపాధ్యా యుడు డబ్బులు తీసుకుని నకిలీ ఉద్యోగ నియామక పత్రం ఇచ్చినట్లుగా మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. దీంతో పోలీసులు ఆ కోణం లో విచారణ చేపట్టారు. సదరు వ్యక్తి ఇంకా ఎంతమందికి ఇలాంటి నకిలీ నియమక పత్రాలను ఇచ్చాడో వివరాలు రాబడుతున్నారు.

ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగంపై కేసు నమోదు

తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మండలంలోని ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ నిధుల దుర్వినియోగం పై కేసు నమోదు చేశారు. కాలనీలో గల జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు జీతాలు దుర్వినియోగంపై ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 6న పాఠశాల ప్రధానో పాధ్యాయుడు రాజభాను చంద్రప్రకాశ్ అదే పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.తిరుమలతో పాటు ఆమె భర్త కె.రాజ్‌కుమార్‌పై ఫిర్యాదు చేశారు. తన సంతాకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు బిల్లులు సృష్టించి ట్రెజరీలో సమర్పించారని, అకౌంట్ నంబర్లు మార్చడం, ఉపాధ్యాయుల వేతనాల నుంచి అధిక చెల్లింపుల రికవరీ పేరిట తనకు తెలియకుండా డబ్బులు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చేరాలు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

కోరుట్ల, ఏప్రిల్ 12 : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన మోటం సాయిల్ (58) అనే వృద్ధుడు మద్యానికి బానిసై ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం సాయిల్ ప్రతి రోజు మద్యం సేవించి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులు, కాలనీ వాసులతో తరుచుగా గొడవ పడేవాడు. దీంతో కుటుంబ సభ్యులు మద్యం మానేయాలని మందలించారు. దీంతో మద్యం మత్తులో సాయిల్ శుక్రవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయిల్ కుమారుడు మధు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రైతులకు బోనస్ ఇవ్వకుంటే ఊరుకోం

- ఢిల్లీకి పంపడానికి మాత్రం పైసలు ఉంటాయా
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్‌కుమార్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 12 : 'ఢిల్లీకి పంపడానికి కాంగ్రెస్‌కు పైసలుంటాయ్.. అభ్యర్థులకు డబ్బులు పంపడానికి పైసలుంటాయ్ కానీ రైతులకు బోనస్ ఇవ్వడానికి మాత్రం పైసల్ ఉండవు' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఆరోపించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ మండలం సంకెపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పరిశీలించారు. స్థానిక రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లోకి ధాన్యం తీసుకొచ్చి పది రోజులవుతోందని, ఇప్పటికీ కొనడం లేదని, తాలు, తరుగు, తేమ పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల చొప్పున కోత విధిస్తున్నారని రైతులు బండి సంజయ్ ఎదుట తమ గోడును వెల్లబోసుకున్నారు. అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అత్యంత దుర్భరంగా మారిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే పరిహారం ఇవ్వడం లేదని, పంట చేతికి వచ్చాక కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే సకాలంలో కొనుగోలు చేయకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాలు, తరుగు పేరుతో క్వింటాల్‌కు 5 నుంచి 8 కిలోల మేరకు కోత విధిస్తున్నారని, రైతులను దోచుకుంటున్నా పట్టించుకునే వారు లేరని అన్నారు. దళారీ వ్యవస్థను రూపుమాపుతున్నట్లు, తాలు, తేమ, తరుగు విధానాన్ని రద్దు చేస్తున్నట్లు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ల ముందు దోపిడీ జరుగుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకుండా రైతులను డిపాల్టర్లుగా మార్చి రూ.3 లక్షల వడ్డీలేని రుణం ఎలా అందిస్తారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో పెనం మీద ఉన్న రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పొయ్యిలో పడినట్లయ్యిందన్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి ఘోరంగా ఉందని, పార్టీలు, ప్రభుత్వాలు మారినా వారి బతుకుల్లో మార్పు రావడం లేదని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో లేనిపోని హామీలు ఇచ్చి ఓట్లు దండుకుని అధికారంలోకి వచ్చిన తరువాత హామీలు ఇచ్చి గాలికి వదిలేశారని, ప్రజలను మోసానికి గురిచేస్తున్నారని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 12 రోజులు అవుతున్నా ఇప్పటి వరకు ఒక్క ధాన్యపుగింజ కూడా కొనలేదని మండిపడ్డారు. రాజన్న సిరిసిల్లలో 259 కేంద్రాలు ప్రారంభించారని, కొనుగోళ్లు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయని అన్నారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి 10 రోజులుగా ఎదురుచూస్తున్నారని, కొనే నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం అకా ల వర్షాలకు దెబ్బతింటుందని రైతులు ఆందోళనకు గురవుతున్నార న్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ విధానం ఏమిటని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో దళారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని, తరుగు, తాలు, తేమ పేరుతో క్వింటాల్‌కు 7 కిలోల కోత విధిస్తే ప్రభుత్వం ఏం చేస్తోందని మండిపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో కొంత ధాన్యం మిల్లుల వద్దకు వెళ్లాక మిగిలిన ధాన్యంలో త రుగు పేరుతో రైతులను నిలువునా దోచుకుంటున్నారన్నారు. జనగామ లో క్వింటాల్ ధాన్యంకు రూ.1500 నుంచి రూ. 1700కు కొనుగోలు చేస్తూ ఒక్కో క్వింటాల్‌కు రూ.700 నుంచి రూ.800 వరకు నష్టం కలిగిస్తున్నారని అన్నారు. కనీస మద్దతు ధరకు గండికొడుతున్నా ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు బోనస్ ఇస్తామని ప్రకటించి ఎందుకు ఇవ్వడం లేదన్నారు. ప్రకృతి వైపరీత్యాలకు పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని చెప్పి, వేలాది ఎకరాలు అకాల వర్షాలకు నష్టపోతే నయాపైసా సహాయం చేయలేదని అన్నారు. రుణమాఫీ చేస్తామని చెప్పి చేయకపోగా కొత్తగా రైతులకు రుణాలు ఇస్తామని మాయ మాటలు చెబుతున్నారన్నారు. ఉన్న రుణమే మాఫీ కాకపోతే కొత్త రుణం ఎలా ఇస్తారని ఎద్దేవా చేశారు. రైతు భరోసా కింద రైతులకు, కౌలు రైతులకు రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని, రూ. 2 లక్షల రుణ మాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. యుద్ధప్రాతిపదికన ధాన్యాన్ని కొనుగోలు చేయా లని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నిస్తే ఇక్కడున్న మంత్రి తనపై అవినీతి ఆరోపణలు చేస్తున్నా రన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య లోపాయికారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. తాను అధికారంలోనే లేనని, అవినీతి కి ఎలా పాల్పడుతానని అన్నారు. అధికారంలో ఉంది మీరేనని, దమ్ముం టే విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా పర్వలేదని, ఇకపై పనికిమాలిన గాలిమాటలు మానుకోవాలని రైతులపై దృష్టిసారించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీజేపీ నాయకుడు చెన్నమనేని వికాస్‌రావు తదితరులు ఉన్నారు


సంకెపల్లిలో రైతులతో మాట్లాడుతున్న బండి సంజయ్

ముగిసిన రెండో విడత జేఈఈ మెయిన్స్


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 12: మండల కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రంలో ఈ నెల 4న ప్రారంభమైన రెండో విడత జేఈఈ(జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్) మెయిన్స్ పరీక్షలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు 124 మంది గైర్హాజరు అయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ లలిత కుమారి తెలిపారు. జేఈఈ పరీక్షలు ఈ నెల 4న ప్రారంభమయ్యాయి. చివరి రోజు జిల్లా వ్యాప్తంగా ఉదయం 9 గంటల నుంచి 12గంటల వరకు పరీక్ష కొనసాగింది. ఈ సెషన్‌లో 311 మందికి గానూ 187 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఫైల్‌నంబరు: 01ఈడీకే12

హంస వాహనంపై స్వామివారల విహారం


హంస వాహనంపై విహరిస్తున్న శ్రీ స్వామి వారు

వేములవాడ, ఏప్రిల్ 12: శ్రీరామ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పార్వతీరాజరాజేశ్వర స్వామి, లక్ష్మీఅనంత పద్మనాభ స్వామివారలు శుక్రవారం హంస వాహనంపై విహరించారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవరాత్రి ఉత్సవాల నాలుగో రోజు ఉదయం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు రాజరాజేశ్వరస్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సీతారామచంద్ర స్వామికి ఉపనిషత్ ద్వారాభిషేకము, సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. పరివార, అనుబంధ దేవతలకు అభిషేకములు నిర్వహించారు. రాత్రి అందంగా అలంకరించిన హంస వాహనంపై పట్టణ వీధుల మీదుగా స్వామివారలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు భక్తులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 12: మండలంలోని రాఘవపూర్ గ్రామం వద్ద లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 8 ఇంక్లైన్ కాలనీకి చెందిన బొజ్జ ప్రశాంత్ (25) అనే యువకుడు హైదరాబాద్‌లో కూలీ పని చేసుకుంటాడు. శుక్రవారం తన ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు వెళ్తుండగా రాఘవపూర్ వద్ద వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే ప్రయత్నంలో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి పోచం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు.

లింగంపేటలో కరెంట్ మోటర్ల చోరీలు

- ఆందోళనలో రైతులు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 12: జగిత్యాల పట్టణంలోని 10వ వార్డులో ఉన్న లింగంపేటలో వరుస చోరీలు జరుగుతున్నాయి. గత కొన్ని రోజులుగా గుర్తు తెలియని దొంగలు విద్యుత్ కరెంటు మోటార్లను టార్గెట్‌గా చేసుకుని అపహరించుకవెలుతున్నారు. ఇప్పటికే లింగంపేటకు చెందిన ఎడ్మల సహదేవ్, సిరికొండ ధర్మయ్య, నరగల్ల ప్రశాంత్‌లకు చెందిన వ్యవసాయ మోటార్లను దొంగలు అపహరించుకవెళ్లారు. తాజాగా దొంగ ధర్మరాజుకు చెందిన వ్యవసాయ మోటారును అపహరించుకవెళడంతో సాగు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. పంట చేతికోచ్చే సమయంలో వరుసగా విద్యుత్ మోటార్లు చోరికి గురికావడం పట్ల రైతులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడంలేదని వాపోతున్నారు. అంతే కాకుండా ఎలుకబావి వాడలో నూతనంగా నిర్మించిన ఓ గృహం వద్ద బోరు మోటారును అపహరించుకువెళ్లారు. దీంతో రైతులతో పాటు ప్రజలు ఆందోళనకు గురువుతున్నారు. పోలీసులు నైట్ బీట్లను మరింత పెంచి దొంగతనాలు జరుగకుండా అరికట్టాలని కోరుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జగిత్యాల డీఎస్పీ రఘుచందర్


ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ధర్మపురి, ఏప్రిల్ 12: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ కోరారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం సీఐఎస్ఎఫ్ కేంద్ర పోలీస్ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. స్థానిక పటేల్ చౌరస్తా, గాంధీచౌక్, నందిచౌక్, కమలాపూర్ చౌరస్తా మీదుగా ఎస్‌హెచ్ గార్డెన్స్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగే ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన అన్నారు. మే నెలలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం అధికంగా పెంచడం కోసం ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన తెలిపారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని ఆయన అన్నారు. సీఐఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ యోగిందర్ సింగ్ మాట్లాడుతూ ఓటింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడరాదని అన్నారు. అల్లర్లు, గొడవలు, ఘర్షణలకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని అన్నారు. అంతకు ముందు ఫ్లాగ్‌మార్చ్ సందర్భంగా పలువురు మహిళలు, యువకులు, విద్యార్థులు పూలు చల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ భీంరావు, డీఎస్పీ రవీంద్రకుమార్, ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి, ఎస్ఐలు ఉదయ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, సతీష్, ఉమాసాగర్, ఆర్ఐ వేణు, ఆర్ఎస్ఐలు మారుతి, సుమన్, సీఐఎస్ఎఫ్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.


ఫ్లాగ్‌మార్చ్ ప్రారంభిస్తున్న డీఎస్పీ రఘుచందర్

మద్యం పట్టివేత

ఇల్లందకుంట, ఏప్రిల్ 12: మండలంలోని మల్యాల, వాగొడ్డు రామన్నపల్లె గ్రామ శివారులో అక్రమంగా మద్యం తరలిస్తుండగా శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాల గ్రామానికి చెందిన రమేష్ 9,700 రూపాయల విలువ గల లిక్కర్‌ను జమ్మికుంట నుంచి అక్రమంగా తరలి స్తుండగా పట్టుకున్నారు. నడిగూడ మండలానికి చెందిన మనోజ్‌కుమార్ 5,500 రూపాయల విలువ గల మద్యాన్ని తరలిస్తుండగా వాగొడ్డు రామన్నపల్లె గ్రామ శివారులో పట్టుకొని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

బావిలో పడి డిగ్రీ విద్యార్థి మృతి


కౌశిక్(ఫైల్)

వేములవాడ రూరల్, ఏప్రిల్ 12 : సిద్దిపేట వద్ద బావిలో పడి ఓ డిగ్రీ విద్యార్థి మృతి చెందగా వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. మర్రిపల్లికి చెందిన రాచర్ల మల్లేశం-లక్ష్మీ దంపతుల కుమారుడు కౌశిక్ (23) గురువారం రాత్రి బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరాడు. సిద్దిపేట జిల్లా ఇమాంబాద్ వద్ద ప్రమాద వశాత్తు బావిలో పడి మృతి చెందాడు.

ఆటో, ద్విచక్రవాహనం ఢీకొని రైతు మృతి


గంగాధర్(ఫైల్)

మల్లాపూర్, ఏప్రిల్, 12: మండలంలోని రాఘవపేట గ్రామంలో సిలిండర్ బు డ్డిలను సరఫరా చేసే ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో రైతు మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం. .గ్రామానికి చెందిన మాధం గంగాధర్(32) అను రైతు గ్రామంలో పనులు ముగించుకొని ఇంటికి వెళు తున్నాడు. ఈ క్రమంలో మెట్‌పల్లికి చెందిన హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ బుడ్డిలను సరఫరా చేసే ఆటో ఢీకొట్టడంతో గంగాధర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గాయాలపాలైన గంగా ధర్‌ను చికిత్స కోసం నిజామాబాద్ ఆసుపత్రికి స్థానికుల సహాయంతో తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృ తుడు మాధం గంగాధర్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. గంగాధర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట శిబిరంపై దాడులు

వీణవంక, ఏప్రిల్ 12: వీణవంక మండలం కనపర్తి గ్రామ శివారులోని పేకాట శిబిరంపై పోలీస్‌లు శుక్రవారం దాడులు చేశారు. మేకల నారాయణరెడ్డి వ్యవసాయ భూమిలో కొంత మంది పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం అందుకున్న ఎస్సై తిరుపతి తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద ఉన్న రూ.49 వేల 760నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చెప్పారు. చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల రద్దీ


క్యూలైన్లో బారులుదీరిన భక్తులు

వేములవాడ, ఏప్రిల్ 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవ స్థానం శుక్రవారం భక్తులతో రద్దీగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు తమ ఇష్ట దైవమైన రాజరాజేశ్వర స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకొని తరించారు. తొలుత ఆలయ కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆ చరించారు. అనంతరం సర్వదర్శనం, ప్రత్యేక దర్శనం క్యూ లైన్ల మీదుగా ఆలయంలోకి ప్రవేశించి రాజరాజేశ్వర స్వామిని దర్శించుకు న్నారు. కళాభవన్‌లో స్వామివారి నిత్య కల్యాణం, సత్యనారా యణ వ్రతం, బాలాత్రిపురా సుందరి దేవి ఆలయంలో కుంకు మ పూజ వంటి ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కును పెద్ద సంఖ్యలో భక్తులు చెల్లించు కున్నారు. అనుబంధాలయమైన బద్దిపోచమ్మ దేవాలయం సైతం భక్తులతో కిక్కిరి సిపోయింది. వందలాదిమంది భక్తులు బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకొని బోనం మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.


స్వామివారిని దర్శించుకున్న భక్తులు

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య


ప్రమీల(ఫైల్)

సుల్తానాబాద్, ఏప్రిల్ 12: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన సుల్తానాబాద్ మండలం చిన్నకలువల గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శ్రావణ్ కుమార్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఏరుకొండ ప్రమీల(45)కు రెండు నెలల క్రితం కాన్సర్ సోకగా కరీంనగర్‌లో చికిత్స పొందుతోంది. అయితే కాన్సర్ సోకిన తాను ఏనాటికైనా చనిపోక తప్పదని, కుటుంబ సభ్యులకు భారం కాకూడదని భావించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. మృతురాలికి భర్త మొగిలి, కుమారుడు, కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెక్‌డ్యాంకు మరమ్మతులు కరువు

కోనరావుపేట, ఏప్రిల్ 12: కోనరావుపేట మండలం మరిమడ్ల అటవీ ప్రాంతంలో జలవనురుల కోసం ఏర్పాటు చేసిన చెక్‌డ్యాం, జాలావాగు కుంట కట్ట రెండేళ్ల క్రితం వర్షాలకు కొట్టుకుపోయాయి. మరమ్మతు చేపట్టకపోవడంతో జలవనరులు వృథాగా పోతున్నాయి. భూగర్భ జలాల పెంపు, సాగునీటి సౌకర్యార్థంతోపాటు వన్య ప్రాణుల దాహార్తి తీర్చేందుకు నిర్మాణాలను చేపట్టారు. అటవీ ప్రాంతంలోని గరక ఒర్రెలో చేపట్టిన చెక్ డ్యాం, జాలవాగు నీరు ఆపడానికి ఏర్పాటు చేసిన కుంట కట్ట రెండు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయాయి. అప్పటి నుంచి మరమ్మతు చేపట్టకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటడమే కాకుండా వన్యప్రాణుల దాహార్తి తీర్చు కోవడానికి ఇబ్బందిగా మారింది. వేసవిలో అటవీ ప్రాంతంలో నీరు లేకపోవడంతో వన్యప్రాణులు జనవాసంలోకి వచ్చి కుక్కల దాడిలో మృతి చెందుతున్నాయి. నీటి వనరులను కాపాడడానికి నిధులు మంజూరు చేసి అటవీ ప్రాంతంలో కొట్టుకుపోయిన చెక్ డ్యామ్‌కు, కొట్టుకపోయిన జాల వాగు కుంట కట్టకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


కొట్టుకు పోయిన మరిమడ్ల జాలవాగు కుంటకట్ట


కొట్టుకపోయిన చెక్ డ్యాం

మళ్లీ తెరపైకి 'నిజాం షుగర్స్'

- పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచార అస్త్రంగా మారిన ఎన్‌డీఎస్ఎల్
- గెలుపోటములపై ప్రభావం చూపే స్థాయిలో చెరుకు రైతులు
- కలగా మిగులుతున్న చక్కర కర్మాగారం పునరుద్ధరణ

జగిత్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ని జాం షుగర్స్ వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రతినిత్యం ఒక రిపై ఒకరు ఆరోపణలు... ప్రత్యారోపణలు చేసుకునే ప్రధాన రాజకీయ పక్షాల్లో సైతం నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ (ఎన్‌డీఎస్ఎల్) వ్యవహారంలో ఒక్కటిగా ఉంటున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్, పసుపు బోర్డు వ్యవహారం రాజకీయ పార్టీలకు ప్రధాన అస్త్రంగా మారిన విధంగానే ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో సైతం ఎన్‌డీఎస్ఎల్ చర్చల్లోకి వస్తోంది. భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రదర్శిస్తూ రాజకీయ పక్షాలు ఎన్‌డీఎస్ఎల్ అంశంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాయి. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో చెరుకు రైతులను ఆకర్షించడానికి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఎత్తులు పై ఎత్తులు వేస్తున్నాయి. ఆ యా పార్టీలకు చెందిన హేమా హేమీల నోట ఇటీవల ఎన్‌డీఎస్ఎల్ మాటలు వచ్చాయి. పసుపు బోర్డు ఏర్పాటు వ్యవహారం, నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్ లో నెలకొన్న సంక్షోభం ప్రస్తుత ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ప్రధానంగా ప్రభావం చూపనుంది. దీంతో చెరుకు రైతుల చుట్టూ రాజకీయం చోటుచేసు కుంటోంది. చెరుకు రైతులను ప్రసన్నం చేసుకోవడానికి అటు ప్రతి పక్ష పార్టీలు, ఇటు అధికార పక్ష పార్టీ వ్యూహ రచనలు చేస్తున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో ఎన్‌డీఎస్ఎల్ అంశాన్ని ప్రచార అస్త్రం గా రాజకీయ పక్షాలు వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి.

1937లో నిర్మాణం..

నిజామాబాద్ జిల్లా బోధన్ శివారులోని శక్కర్‌నగర్‌లో 1937లో అప్పటి నిజాం నవాబ్ నిజాం షుగర్స్ కర్మాగారాన్ని నిర్మించారు. 1979-80లో కరీంనగర్ జిల్లా మెట్‌పల్లి, మెదక్ జిల్లా ముంబోజుపల్లి, జహీరాబాద్‌లలో నిజాం షుగర్స్ కర్మాగారాలను నిర్మించారు. 2002 సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం కర్మాగారాలను నష్టాల కారణంగా ఉమ్మడి యాజమాన్యం కిందకు తెచ్చింది. 2002 అక్టోబర్ 31వ తేదిన ఆంధ్రాప్రాంతానికి చెందిన డేల్టా కంపెనీకి ఉమ్మడి యాజమాన్యం కింద అప్పగించింది. అప్పటి నుంచి నిజాం దక్కన్ షుగర్స్ లిమిటెడ్‌గా రూపాంతరం చెందింది. 2015 డిసెంబర్ 22 లేఆఫ్ ప్రకటించిన ప్రైవేటు యాజమాన్యం కర్మాగారాలకు సంకెళ్లు వేయ డంతో ఇప్పటి వరకు తెరుచుకోలేదు. ప్రస్తుత ఎన్నికల్లో రాజకీయ పక్షాలు చెరుకు రైతుల ప్రయోజనాల ప్రాధాన్యతే ఎజెండాగా ముందుకు వెళ్తుండ డంతో రైతు చుట్టూ రాజకీయం నడుస్తున్నట్లయిందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

హేమా హేమీల నోట..

జగిత్యాలలో గత నెల 18వ తేదీన ఎన్నికల ప్రచార విజయ సంకల్ప సభను నిర్వ హించిన ప్రధాని నరేంద్ర మోదీ నిజాం దక్కన్ షుగర్ కర్మాగారాన్ని ఇప్పటివరకు బీఆ ర్ఎస్, కాంగ్రెస్‌లు తెరిపించలేకపోయాయని విమర్శించారు. నిజామాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు సందర్భాల్లో ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణ బీజేపీతోనే సాధ్యమవుతుందని అంటున్నారు. ఎమ్మెల్సీ, కాంగ్రెస్ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి మరో అడుగు ముందుకు వేసి ఎన్‌డీఎస్ఎల్ కర్మాగారాలను వచ్చే యేడాది పునరుద్ధరిస్తామని హామీనిస్తున్నారు. రాష్ట్రంలో ఇటీవల కాంగ్రెస్ ప్రభు త్వం అధికారంలోకి వచ్చిన తదుపరి ఎన్‌డీఎస్ఎల్ పునరుద్ధరణకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం చేయించామని వివరిస్తున్నారు. బీఆర్ఎస్ సైతం ఎన్‌డీఎస్ ఎల్‌పై ఆచితూచి వ్యవహరిస్తోంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ విజయభేరి బస్సు యాత్రలో భాగంగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చెరుకు రైతులను ఆదుకుంటామని, అధికారంలోకి వచ్చిన వెంటనే జగిత్యాల జిల్లా ముత్యంపేట, నిజామాబాద్ జిల్లా బోధన్, మెదక్ జిల్లా ముంబోజుపల్లి నిజాందక్కన్ షుగర్స్ లిమిటెడ్ కర్మాగారాలను తెరిపిస్తామని రైతులకు హామీనిచ్చారు. అన్నదాతలను ఆకర్షించడానికి బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లు వ్యూహాన్ని రచిస్తున్నాయి.


జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారం

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు



లోకపేటలో శిథిలావస్థకు చేరిన భవనం



అద్దె భవనంలో కొనసాగుతున్న నర్సాపూర్ అంగన్‌వాడీ కేంద్రం

ఎలిగేడు, ఏప్రిల్ 12 : మండలంలోని పలు అంగన్వాడీ సెంటర్లు అద్దె ఇళ్లలో మగ్గుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని 12గ్రామాలకు 25అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. అందులో సుల్తాన్‌పూర్, నర్సాపూర్, ర్యాకల్‌దేవ్‌పల్లి. నేతాకానిపల్లి, ఎలిగేడు, ధూళికట్టలో కేంద్రాలు స్వంత భవనాలు లేక అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. మరికొన్ని ప్రభుత్వ తాత్కాలిక భవనాల్లో నడుస్తుండగా వాటికి అద్దె చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. లోకపేట గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉంది. గతంలో నిర్మించిన అంగన్‌వాడీ సెంటర్‌ల కాంట్రాక్టర్ల నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం మూలంగా కూలిపోయే దశకు చేరుకున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పక్కా భవనాలు నిర్మించాలి

- సూపర్‌వైజర్ సూర్యకళ

అంగన్‌వాడీసెంటర్లకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించాలి. కూలిపోయే దశలో ఉన్న భవనాల్లో ఫ్లోరింగ్ పగుళ్లు బారి పాములు, తేళ్లు ఇతరత్రా విష పురుగులు తిరుగుతున్నాయి. దీంతో చిన్నపిల్లలను ప్రాణాలను అరచేతిలో పట్టుకొని కాపాడుతున్నాం. ఇప్పటికైనా సెంటర్లకు పక్కా భవనాలు నిర్మించాలి

సర్వే నివేదిక అందజేస్తాం

- తహసీల్దార్ జాహెద్ పాషా

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 12: పాండవుల గుట్ట కబ్జా అవుతుందని, అధికారులు స్పందించాలని ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జాహెద్ పాషా మాట్లాడుతూ పాండవుల గుట్ట 597 సర్వే నెంబర్‌లో ఎవరెవరు ఆక్రమించుకున్నారనే విషయంపై గుట్ట ప్రాంతమంతా సర్వే చేయించడం జరుగుతుందన్నారు. సర్వే చేసి హద్దులు నిర్ణయించి సంబంధిత అధికారులకు సర్వే రిపోర్టు అందజేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. రెవెన్యూ ఆధీనంలో ఉన్న పాండవుల గుట్ట ప్రాంతం ఎవరైనా అక్రమంగా కబ్జా చేస్తే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. 597 సర్వే నంబర్‌గల ఈ ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా కాస్తు చేసినా, ఆక్రమించుకున్నా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పాండవుల గుట్ట ప్రాంతంలో 597 సర్వే నంబర్లు ప్రభుత్వ కార్యాలయాలు పోను మిగిలిన స్థలం ఎంత ఉన్నదనే విషయంపై సర్వే చేయించి హద్దులు నిర్ణయించి సంబంధిత ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

మెడికల్ కళాశాలకు దేహం దానం



శాంతయ్యగౌడ్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 12: మండలంలోని పందిళ్ళ గ్రామానికి చెందిన ఇల్లందుల శాంతయ్య గౌడ్(85) గురువారం మృతిచెందగా, ఆయన పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు ప్రైవేట్ వైద్య కళాశాలకు అప్పగించి ఆదర్శంగా నిలిచారు. కల్లు గీత కార్మికునిగా పనిచేసిన శాంతయ్యగౌడ్ సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి భీష్మాచారి ఆధ్వర్యంలో ఓదెల మండలంలో నేత్ర, అవయవ, శరీర దానాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన సందర్భాల్లో శాంతయ్యతో పాటు కుటుంబ సభ్యులు ఆరునెలల క్రితం స్పందించి అంగీకారం ప్రకటించారు. శాంతయ్య మరణించడంతో ఆయన పార్థివ దేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేయడానికి మృతుని కుటుంబ సభ్యులు ముందుకువచ్చారు. ఈ విషయం తెలిసిన సదాశయ ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మెరుగు భీష్మాచారి ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని ప్రతిమ ప్రైవేట్ మెడికల్ కాలేజీకి శాంతయ్య పార్థివ దేహాన్ని అప్పగించారు. ఈ కార్యక్రమంలో సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు క్యాతం మల్లేశం, డాక్టర్ వేణు, డాక్టర్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ రావి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు ఆటల పోటీలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 12: హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక హౌజింగ్ బోర్డు కాలనీలోగల బాల కుటీర్ చిన్నారులకు ఐదు రోజులుగా వివిధ రకాల ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. వాటిలో గెలుపొందిన 24 మంది విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం క్రీడా పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దనపురి సత్యమ్మ, బాలకుటీర్ అధ్యక్షుడు బి కరుణాకర్ రావు, రాజరెడ్డి, కనకయ్య, శ్రీనయన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిలయంలో వసంత నవరాత్రి ఉత్సవాలు

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 12: వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తిరుమలనగర్‌లోని శ్రీనిలయంలో నాలుగో రోజు శుక్రవారం నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో లక్ష్మీహవనం నిర్వహించారు. అంతకుముందు రామచంద్రస్వామికి, లక్ష్మీ అమ్మవారికి ఫలరస పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సముద్రాల వేణుగోపాలాచార్యులు, రామకృష్ణమాచార్యులు, గోపీశర్మ, శివరామకృష్ణశర్మ, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డుపక్క ట్రాన్స్‌ఫార్మర్లు.. పొంచి ఉన్న ప్రమాదం



ఓదెల-కొలనూర్ రోడ్డులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మరు

ఓదెల, ఏప్రిల్ 12 : నిరంతరం వ్యవసాయ పనులకు వెళ్లే ప్రధాన రహదారిలో రైతన్నలకు, బాటసారులకు, వాహనదారులకు విద్యుత్ ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఓదెల నుంచి కొలనూర్ వైపు వెళ్ళేందుకు నూతనంగా విశాలమైన రోడ్డు నిర్మాణ మవుతుంది. ఈ రోడ్డు ఎడమ వైపు నాలుగు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. రోడ్డు నిర్మించేందుకు ట్రాన్స్‌ఫార్మర్ల వరకు మట్టి పోశారు. రోడ్డు వెడల్పును విస్తరించడంతో అంతకుముందు పంటల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ఇప్పుడు రోడ్డు పక్కకు వచ్చాయి. అలాగే రోడ్డు ఎత్తు పెరగడంతో ఇప్పుడు పక్కన నుంచి వెళితే భుజాలకు, చేతులకు తగిలే ఏత్తులో ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి. రోడ్డు పూర్తి నిర్మాణం అయితే ప్రధానంగా మండలంలోని వివిధ గ్రామాల నుంచి కొలనూర్, పెద్దపల్లి వైపు అధికంగా వాహన రాకపోకలు పెరిగే అవకాశాలున్నాయి. అలాగే నిరంతరం ఓదెలకు చెందిన రైతులు తమ పంటలకు సాగునీరు పెట్టేందుకు అలాగే కాలువ నీటి విడుదల సమయంలో రాత్రింబవళ్లు రైతులు తమ పంటల వైపు వెళ్తారు. అలాగే రాకపోకల సమయంలో కూడా వాహనాలు పక్కన నుంచి వెళ్లే పరిస్థితి ఉంది. రానున్న వర్షాకాలంలో వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో ప్రమాదం పొంచి ఉందని, రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యే సమయానికి ట్రాన్స్‌ఫార్మర్లను వేరే చోటికి తరలించాలని, లేకుంటే ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ వలయాలను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

సుల్తానాబాద్ ప్రాంత అభివృద్ధికి కృషి

- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



వాకర్స్‌తో కలిసి నడుస్తున్న కొప్పుల ఈశ్వర్

సుల్తానాబాద్, ఏప్రిల్ 12: చాలా ఏళ్ల నుంచి ప్రజా సేవలో ఉన్నానని, తనను పార్లమెంట్‌కు పంపిస్తే సుల్తానాబాద్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలో ఆయన శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముందుగా వాకర్స్‌ను కలిసి ఓటు అభ్యర్థించారు. అనంతరం పట్టణంలోని పలు వ్యాపార వాణిజ్య సంస్థల వద్దకు వెళ్లి ఓటర్లను కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీపీ బాలాజీరావు, డాక్టర్ రమేష్, అశోక్ రెడ్డి, దాసరి ఉష, మండల పార్టీ అధ్యక్షులు పురం ప్రేమ్‌చందర్‌రావు, రాజమల్లయ్య, సింగిల్‌విండో చైర్మన్లు జూపల్లి సందీప్‌రావు, మహిపాల్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్,తాళ్లపల్లి మనోజ్‌గౌడ్, ఫకీర్‌యాదవ్, గొట్టం మహే ష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తాలో శుక్రవారం పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. పలు దుకాణాల్లో తిరిగి ఓట్టు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఓ టిఫిన్ సెంటర్‌లో ఓటు అడిగి అంక్కడే టిఫిన్ చేశారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి, మహిళా నాయకులు దాసరి ఉష, పెద్దపల్లి పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, ఎంపీపీ బండారి స్రవంతి, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మార్కు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎడారిగా మారిన హుస్సేనిమియా వాగు



వడుకాపూర్ శివారులో ఎడారిగా మారిన హుస్సేనిమియావాగు

జూలపల్లి, ఏప్రిల్ 12 : హుస్సేనిమియావాగు నీరు లేక ఎండిపోయి ఎడారిగా తలపిస్తోందని. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. హుస్సేనిమియా వాగు సాగునీటిపై ఆధారపడి రైతులు వరి, మొక్కజొన్న పంటలను సాగుచేసినప్పటికి వాగులో నీరు రాక పంటలకు నీరు అందడంలేదని, వేసిన పంటలను రక్షించుకునేందుకు వాగులో తాత్కాలికంగా బావులను తవ్వినప్పటికి వాటిలో సైతం సరిపడా నీరు ఎల్లక తీవ్రంగా అవస్థలు పడుతున్నామని రైతులు ఆరోపిస్తున్నారు. వేసిన పంటలు చివరి దశకు చేరుకుని చేతికందే సమయంలో సాగునీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగునీటిని హుస్సేనిమియావాగులో వదిలి సాగుచేసిన పంటలను కాపాడాలని మండల రైతులు కోరుతున్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ వినియోగంలోకి తెస్తాం..

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కోల్‌సిటీ, ఏప్రిల్ 12: గత పాలకుల కమీషన్ల కక్కుర్తి, ప్రణాళిక లోపంతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ నిరుపయోగంగా ఉందని, కొన్ని మార్పులు చేర్పులు చేసి దీన్ని వ్యాపారులకు సౌకర్యంగా ఉండేలా వినియోగంలోకి తీసుకువస్తామని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. శుక్రవారం మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లతో కలిసి ఆయన షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. కొన్ని కొన్ని మార్పులు చేసి అత్యాధునిక సౌకర్యాలతో ప్రజలకు సౌకర్యవంతంగా షాపింగ్ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా మొదటి, రెండవ అంతస్తులను పరిశీలించిన ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. ఆయన వెంట కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ముస్తాఫా, బాలరాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మారెల్లి రాజిరెడ్డి, పాతిపెల్లి ఎల్లయ్య, గట్ల రమేష్, తిప్పారపు శ్రీనివాస్ ఉన్నారు.

నంది అవార్డు ప్రదానం



నంది అవార్డును అందుకుంటున్న సదయ్య

సుల్తానాబాద్, ఏప్రిల్ 12: గత ఇరవై ఏళ్లు చారిటబుల్ ట్రస్టు ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సుల్తానాబాద్ కు చెందిన ఏగోలపు సదయ్య గౌడ్‌కు నంది అవార్డును అందజేశారు. హైదరాబాద్ తిలక్‌రోడ్డులోని దేవులపల్లి రామానుజరావు కళామందిరం, తెలంగాణ సారస్వత కళాపరిషత్ భవనంలో శుక్రవారం ఉగాది నంది అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళానిలయం కల్చరల్ సోషల్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు పుష్పలత, కార్యదర్శి సురేందర్, మాజీ డీసీపీ సుంక సత్యనారాయణ, వంశీ ఆర్ట్స్ అధ్యక్షుడు రామరాజు, సినీ నిర్మాత బద్రీనాథ్ తదితరలు పాల్గొన్నట్లు సదయ్య తెలిపారు.

పెరిక సంఘం యూత్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా సతీష్

ఓదెల, ఏప్రిల్ 12 : పురగిరి క్షత్రియ పెరిక సంఘం యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఓదెలకు చెందిన అల్లం సతీష్‌ను శుక్రవారం నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి జయప్రకాష్ నియామకపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కమిటీలో చోటు దక్కినం దుకు పెరిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్దె లింగయ్య, యువజన రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్, దొంగరి మనోహర్, ముత్తినేని వీరయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే సతీష్ ఎన్నికపై మండల, గ్రామ పేరిక సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా లక్ష్మణ్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 12: అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెద్దపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన బత్తిని లక్ష్మణ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు మేకల మల్లేశం యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ యాదవుల సంక్షేమం కోసం తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. యాదవ హక్కుల పరిరక్షణలో ముందుంటానని లక్ష్మణ్ పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మహనీయుల స్ఫూర్తిని చాటి చెప్పడమే లక్ష్యం

- జడ్పీ చైర్మన్ పుట్ట మధు



అంబేద్కర్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న పుట్ట మధు

మంథని, ఏప్రిల్ 12: మహనీయుల స్ఫూర్తిని బడుగు బలహీన వర్గాల ప్రజలకు చాటి చెప్పడమే తమ లక్ష్యమని జడ్పీ చైర్మన్ పుట్ట మధు తెలిపారు. మహనీయుల స్ఫూర్తి దీక్షలో భాగంగా బీఆర్ఎస్ నాయకుడు తగరం శంకర్ లాల్‌తో కలిసి జడ్పీ చైర్మన్ పుట్ట మధు శుక్రవారం మహారాష్ట్ర ముంబైలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ నివాసమైన రాజగృహను, అంబేద్కర్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అనేక త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని బడుగు బలహీన వర్గాల ప్రజలకు చాటి చెప్పడమే తమ లక్ష్యమని తెలిపారు.

మహాలక్ష్మి ఆలయంలో శ్రీచక్ర ప్రతిష్ఠాపనకు శ్రీకారం

మంథని, ఏప్రిల్ 12: స్థానిక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీచక్ర ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వేదోక్తంగా పండితులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. శ్రీశృంగేరి శారదా పీఠాధి ఈశ్వరులైనటువంటి జగద్గురువులు శ్రీభారతీ తీర్థ మహాస్వామి వారు, శ్రీవిధుశేఖర భారతిస్వామి వారి కరకమలములతో స్వయంగా అందించబడిన శ్రీచక్రాన్ని ప్రతిష్ఠాపన పూజా కార్యక్రమాలు ఆలయ అవరణలో రెండు రోజులపాటు జరుగనున్నాయి. ఈకార్యక్రమంలో అధిక భక్తులు పాల్గొన్నారు.

పట్టపగలు వెలుగుతున్న విద్యుత్ దీపాలు



ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం వద్ద వెలుగుతున్న విద్యుత్ దీపం

ఓదెల, ఏప్రిల్ 12: ప్రభుత్వ కార్యాలయాల్లో పగలు కూడా విద్యుత్ వెలుగులు కనబడుతున్నాయి. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం పగలు విద్యుత్ దీపం వెలిగి ఉంది. గురువారం విధులకు హాజరైన సిబ్బంది ఆరోగ్య కేంద్రం వద్ద లైట్ వేసి ఉంచి మర్చిపోవడంతో శుక్రవారం నాడు కూడా పొద్దంతా విద్యుత్ లైట్ వెలిగే ఉంది.

ఎన్టీపీసీ రెడ్డి సంక్షేమ సంఘం కార్యవర్గం



రమణారెడ్డి, జనార్దన్‌రెడ్డి

జ్యోతినగర్, ఏప్రిల్ 12: ఎన్టీపీసీ రెడ్డి సంక్షేమ సంఘం కార్య వర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మోగుసాల రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోరండ్ల జనార్దన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా ముదిగంటి కృష్ణారెడ్డి, కోశాధికారిగా గుడిపాటి తిరుపతి రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా జన్నుపెల్లి కృష్ణారెడ్డిని ఎన్నుకున్నారు. 2024-26 సంవత్సరాలకు గాను ఈ కమిటీ పని చేయనుంది. టీటీఎస్‌లో జరిగిన సమావేశంలో రెడ్డి సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు మండల బక్కారెడ్డి, కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ రాఘవరెడ్డి, దొండపాటి మల్లారెడ్డి, కాంతాల శ్రీనివాస్‌రెడ్డి(ఏబీసీ రెడ్డి), కార్పొరేటర్ ఎన్వీ రమణారెడ్డి, కొలని వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు వడాల విజేందర్‌రెడ్డి, కూర మహేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ వైఫల్యంతోనే సాగునీటి ఇబ్బందులు

జూలపల్లి, ఏప్రిల్ 12: గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యంతోనే సాగునీటి ఇబ్బందులు వచ్చాయని కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకుడు మానుమండ్ల శ్రీనివాస్ ఆరోపించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన తప్పిదాలతోనే ఈ ప్రాంతానికి సాగునీరు కరువైందని మండిపడ్డారు. నంది మేడారం పంప్‌హౌస్ నుంచి సిద్దిపేట, హైదరాబాద్ ఇతర ప్రాంతాలకు ఇక్కడి నీటిని తరలించుకుపోతే ఇక్కడి ప్రాంతంలోని బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అడ్డుకోలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. పత్తిపాక వద్ద రిజర్వాయర్‌కు అప్పటి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎందుకు నిర్మించలేదో జవాబుచెప్పాలని డిమాండ్ చేశారు. సాగు నీటి కొరతపై కాంగ్రెస్‌పార్టీ నాయకులను ఎమ్మెల్యేలను, ప్రభుత్వాన్ని నిందించడం మానుకోవాలని హితవు పలికారు. సమావేశంలో ఎండీ పకీర్, పొరండ్ల స్వామి, పొట్యాల బీరయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోల్‌సిటీ, ఏప్రిల్ 12: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శారదానగర్ సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్టు శారదానగర్ ఏఈ దేవస్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.30గంటల నుంచి 12గంటల వరకు చెట్ల కొమ్మలు తొలగించడంపై సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. జైభీంనగర్, బస్టాండ్‌కాలనీ, సప్తగిరికాలనీ, పవర్‌హౌస్‌కాలనీ, జీఎంకాలనీ, బాపూజీనగర్, సీఎస్‌పీ కాలనీలలో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అలాగే గౌతమినగర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం ఎనిమిది గంటల నుంచి 12.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అదనపు సహాయక ఇంజనీర్ మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఎఫ్‌సీఐ ఫీడర్ పరిధిలోని లక్ష్మీపూర్‌గేట్, ప్రగతినగర్, మాతంగి కాలనీ, ఖాజిపల్లి ప్రాంతాలకు విద్యుత్‌సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

ధర్మారం: ధర్మారం మండలంలోని ధర్మారం, మల్లాపూర్, కొత్తూర్ గ్రామాల్లో సబ్‌స్టేషన్‌ల్లో మరమ్మతుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ ఖాశీం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించగలరని ఆయన కోరారు.

రాజ్యాంగాన్ని మారుస్తామనే వారికి బుద్ధిచెప్పాలి

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 12: బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని మారుస్తామని చెపుతున్న బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని, రాజ్యాంగాన్ని పరిరక్షించే బహుజన సమాజ్ పార్టీని గెలించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు ఇరికిల్ల రాజనరసయ్య కోరారు. శుక్రవారం గోదావరిఖనిలోని బీఎస్పీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మతతత్వం పేరుతో ప్రజల్లో ఐక్యతను దెబ్బతీస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జి నరేష్, రామగుండం నియోజకవర్గ ఇంచార్జీ కనకయ్య, సంతోష్, తోకల రమేష్, జనగామ లింగయ్య, సది, మల్లేష్ పాల్గొన్నారు.



కార్మికుల క్వార్టర్లలో అధ్వానంగా డ్రైనేజీలు



డ్రైనేజీ కుండి నుంచి బయటకు వస్తున్న మురుగునీరు

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 12: సింగరేణి ఆర్జీ-1 సెక్టార్-2 పరిధిలోని ద్వారాకానగర్‌లోని పలు క్వార్టర్లలో డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. దీంతో కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. డి-2388 క్వార్టర్ ఆవరణలోని డ్రైనేజీ కుండీ నుంచి మురుగునీరు బయటి వస్తుండంతో కంపు భరించలేకపోతున్నారు. మరికొన్ని క్వార్టర్‌లలో కూడా డ్రైనేజీ కుండీలు పొంగుతున్నాయి. ఈ విషయంలో పలుసార్లు సంబంధిత విభాగం దృష్టికి తీసుకువెళ్ళినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, సిబ్బంది స్పందించాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

పోస్టుల భర్తీల్లో అవకాశం కల్పించండి

- సీఎండీని కోరిన సింగరేణి పాలిటెక్నిక్ విద్యార్థులు



సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

గోదావరిఖని, ఏప్రిల్ 12: సింగరేణిలో ఇటీవల యాజమాన్యం విడుదల చేసిన జేఎంటీ ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీలో అవకాశం కల్పించాలంటూ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల మైనింగ్ విద్యార్థులు శుక్రవారం సీఎండీ బలరాంనాయక్‌కు విజ్ఞప్తి చేశారు. మైనింగ్ డిప్లొమా ఫైనల్ సెమిస్టర్ చదువుతున్న తమకు ఒరిజినల్ ధ్రువపత్రాలు ఈ ఏడాది జూన్, జూలై నెలలో యూనివర్సిటీ నుంచి వెలువడుతాయని తెలిపారు. దీంతో తాము సర్టిఫికెట్లు సమర్పించలేమని, జేఎంటీకి దరఖాస్తు చేసుకోవడానికి తమకు అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్వార్టర్ కౌన్సెలింగ్‌కు హాజరుకండి

గోదావరిఖని, ఏప్రిల్ 12: గోదావరిఖని పట్టణాభివృద్ధి పనుల్లో భాగంగా ఆర్జీ-1 పరిధిలో శివాజీనగర్, హనుమాన్‌నగర్, గాంధీనగర్‌లలో నివాసముంటున్న సింగరేణి ఉద్యోగులు త్వరగా క్వార్టర్లు ఖాళీ చేయాలని, శనివారం జరిగే క్వార్టర్ల కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని సింగరేణి ఆర్జీ-1 అధికార ప్రతినిధి లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఆర్‌సీఓఏ క్లబ్‌లో క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఉద్యోగులకు స్పెషల్ క్వార్టర్స్‌ను కేటాయించడం జరుగుతుందని, ఇందులో సెక్టార్-1లో 29క్వార్టర్లు డీటైపు, ఎస్‌టీ2, టీ2, ఎండీ, సెక్టార్-2 ఏరియాలో 39మందికి హైయర్ టైపు క్వార్టర్లు ఎంసీ, సీటైపు, ఎస్‌సీటు, 31 డీసీహెచ్ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లకు ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

డైరెక్టర్ల దృష్టికి కార్మికుల సమస్యలు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12: సింగరేణి కార్మికుల ఆరోగ్యానికి సంబం ధించి తమ యూనియన్ డైరెక్టర్‌లతో మాట్లాడిందని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, సహాయకార్యదర్శి కంది శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం యూనియన్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఇటీవల జరిగిన ట్రస్టుబోర్డు సమావేశంలో రిటైర్‌మెంట్ రోజున సీపీఆర్ ఎంఎస్ కార్డు ఇవ్వాలని తమ యూనియన్ అగ్రనాయకులు కోరగా యాజమాన్యం అంగీకరించిందన్నారు. క్యాన్సర్, కిడ్నీ, తదితర జబ్బుల విషయంలో గతంలో కేటాయించిన రూ.8 లక్షలు సరిపోవడం లేదని, దీన్ని పెంచాలని, దీన్ని ట్రస్టే భరించాలని కోరగా దీనికి కూడా అంగీకరించారని తెలిపారు. 5వేల మంది రిటైర్డు కార్మికులకు లైఫ్ సర్టిఫికెట్లు జతపర్చలేదని, వారిపేర్లు ఏరియాల వారీగా తెలియజేస్తామని అన్నారు.

పెండింగ్‌లో ఉన్న సీఎంపీఎఫ్ రుణాల గురించి ప్రశ్నించగా అధికారులు కోల్ ఇండియాకు వెళ్లారని వారు వచ్చిన వెంటనే నిర్ణయం తీసుకుంటామని తెలిపారని పేర్కొన్నారు. తమ అధ్యక్షుడు సీతారామయ్య, ప్రధానకార్యదర్శి రాజ్‌కుమార్ పాల్గొని సమావేశంలో మాట్లాడారని వారు పేర్కొన్నారు. నాయకులు సంపత్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.